స్థాయీభేదం

"ధర్మం తల్లీ. ధర్మం చేయండమ్మా. మీ బిడ్డపాపలు కల కల లాడుతూ సల్లగుంటారు."

"దరమం సెయ్యమ్మా. పున్నెం జేసుకో తల్లీ. నీ యిల్లు సల్లగుంటది."

ఆ జంట స్వరాలు పదినిముషాలు పైగానే అలా వినవస్తున్నాయి.

"ఛీ, వెధవ సొద." చదువుతూన్న పుస్తకము ఆపి యిటు తిరిగింది విద్య.

గ్రుడ్డివాడిని చేయిపట్టుకొని నడిపించుకుంటూ వస్తుంది కుంటి మనిషి రోజూ.

"రోజూ యిదే వేళ. ఛీ. కాస్త పని తీరుబాటై వీధి వరండాలో విశ్రాంతిగా కూర్చోబోయేసరికి ఈ ముష్టి మూక

తయారు...... ఛోఛో. రోజూ పనీ పాటూ లేదు. వెధవ సంత. అరవబోక, చెవులు పాడౌతున్నాయి."

ఇటువంటి చీదరింపులూ, అదిలింపులూ లెఖ్ఖ జేసుకుంటే వాళ్ళు బిచ్చానికెందుకొస్తారు? ఆ మాటలన్నీ మరెవరినో అన్నట్టుగా, విననట్లుగా యింకా దీనాలాపాలు మరింత తారస్థాయిలో విన్పించుతోంది బిచ్చగత్తె.

"నిన్నటి కాడనుండీ తిండి లేదమ్మా. రచ్చించు తల్లీ! లోపలి సిన్న పేణానికైనా పిడికెడు ముద్దెయ్యి తల్లీ." అంటూ కడుపు సవరించుకుంటోంది.

"ఖర్మ, ఇంతోటి బ్రతుకులకూ యిది కూడానా?" అసహ్యం అధికమైంది విద్యకు. విసుగ్గా లేచి, భళ్ళున తలుపులు మూసి లోనికి వెళ్ళిపోయింది.

కొంతసేపు అలాగే నిరర్థకంగా అఱచి, నిష్క్రమించారు భిక్షకులు.

అయితే అది ఒక్కనాటి విషయం కాదు. ముష్టి దొరికినా, దొరకకున్నా వాళ్ళు ఆ వీధిలో రోజూ ప్రతి యింటి ముందూ నిలచి అడుక్కుంటారు. అదే వాళ్ళ వృత్తి. ఆ వీధి మొగలో వున్న పెద్ద చింతచెట్టు నీడ వాళ్ళ పాలిటి గూడు.

మరి వానా వఱదా వచ్చినప్పుడు ఎలా బ్రతుకుతారో?

ఎవరి పంచకో, ఏ పాడుబడ్డ సత్రపు అరుగు మీదికో జేరతారేమో?

ఇంతపాటి ముష్టి బ్రతుకులకూ వంశాభివృద్ధి ఒకటా పైగా! బొత్తిగా జ్ఞానం వుండదేం?

జనాభాను తగ్గించమని బోధించే వాళ్ళెవళ్ళూ ఇటువంటి వాళ్ళ విషయం పట్టించుకోరేం?

ఏదో నాలుగు రాళ్ళు తెచ్చుకొనేవాళ్ళు పిల్లల్నెలాగైనా పోషించుకుంటారు. అదీకాక, ఓ మాదిరి స్థాయి వాళ్ళందఱకూ ఈ మధ్య ఎవరి పుణ్యం వల్లనైతేనేం, ఇటువంటి విజ్ఞానం బాగానే పెరిగినట్లూ, మెలకువలు తెలిసినట్టూ అన్పిస్తోంది.

ప్రచారాలు, ఉచిత సహాయాలు ఈ రోడ్డు ప్రక్క వాళ్ళకే అవసరంగా కలుగ జేయాలని ఎవరికీ తోచలేదా? లేదా మహామహులెవరి దృష్టిలోనూ వీళ్ళు మనుషులే కాదా?

ఈ తర్క వితర్కాలూ, పరిశీలనా విద్య మనసులో అంతకు పూర్వం గల కొలది మాత్రపు దయాబుద్ధినీ కూడ రూపు మాపివేసి ఆ స్థానే జుగుప్సకు తావునిచ్చాయి.

'పాపం' అని దయతలచి అప్పుడప్పుడు వేసే ముష్టిని కూడా మానివేసినా కుతూహలంగా గమనించడం మాత్రం మానలేదు.

గమనించిన ప్రతి తడవా ఏవగించుకొనడమూ మానలేదు.

2

"ఒకళ్లు కుంటి, మరొకళ్ళు గ్రుడ్డి. ఇక ఈ ఇద్దరి సంతానానికీ మరేమి అంగవైకల్యమూ వైపరీత్యమూ కలుగుతాయో? ఎంత అజ్ఞానమైనా ఆ మాత్రపు ఆలోచన వుండదా? వాళ్ళకే పొట్ట గడవని గతిమాలిన వాళ్ళు. మరో ప్రాణిని ఈ ప్రపంచంలోనికి తెచ్చి కష్టాలు పడమనడం ఎంత దారుణం! ఇటువంటి వాళ్ళకు జ్ఞానోదయం కలిగించి ఉద్ధరించరేం మీ మహా మహా సంఘ సేవికలందరూ?"

ఆవేశంగా వచ్చిన విద్య సవాలును శాంత చిరుహాసంతో కొట్టిపారేసింది.

"వాళ్ళు చేస్తూన్నది మహా పాపమూ, నేరమూ అంటాను. అటువంటి వాళ్ళకు భిక్షం వేసి మీరంతా సంఘానికి ఇంకా ఇంకా కీడు కలిగించుతున్నారంటాను."

"ఏమీ కాదంటాను ఖచ్చితంగా. నీ ఆవేశం తగ్గించుకో. దొరక్క దొరక్క ఆ చెట్టుక్రింద బ్రతికే బీద పక్షులే దొరికారా నీకు ధర్మపన్నాలు చెప్పటానికీ, సంఘ పటిష్ఠత గురించి ఉపన్యసించడానికీను?"

"ఎందుక్కాదు? నా ఆవేశం తగ్గదు. మీరు

వీళ్ళందరికీ జీవితపు విలువలు తెలియజెప్పే పథకాలూ, శ్రమించి బ్రతకగల దారులూ ఏర్పాటు చేయరాదూ?"

"హు! 'ఆడదానికి చదువెందుకూ?' 'డబ్బున్నవాడికి ఉద్యోగమెందుకూ?' అని ఇప్పటికీ నీల్గుతూనే వున్న సమాజంలో — విద్యావంతులనే మార్పులేని మన సమాజంలో, దివారాత్రులూ పొట్టకోసం ముష్టెత్తుకొనేవాడికి పాఠాలు నేర్చుకొనే తీరిక వుండదు. వాళ్ళు ఏ స్థితిలోవున్నా, వాళ్ళూ మనుషులే గనుక కోరికలుంటాయి, తీర్చుకుంటారు."

"నేను చెప్పేది..."

"ఆగు. నేను చెప్పేదికూడావుంది. ఆ బిచ్చగాళ్ళను పిలిచి మన యింట గిన్నెలు తోమే పని యిచ్చి ఉపాధి కల్పించుదామా?"

"ఛ ఛ. వాళ్ళనా? వాళ్ళకేం తెలుసు శుభ్రతా, శుచీను? డాక్టరువై యుండీ ఆ మురికివాళ్ళను యింట ఎలా పెట్టుకుంటావు?"

"చూశావా మరి? అందుకే యింట గెలిచి రచ్చ గెలవమన్నారు. ఎందుకొచ్చిన కంఠశోషగానీ నేను వెళ్ళొస్తాను. ఎప్పుడైనా రా నువ్వు మా యింటికి."

3

పరీక్ష ముగించి చిరునవ్వు నవ్వింది శాంత.

"కంగ్రాచ్యులేషన్స్. నీకు నాలుగవ నెల." విద్య వదనం వికసించింది.

అవసర జాగ్రత్తలన్నీ శాంతనుండి తెల్సుకొని, అనవసరమైనప్పటికీ బలవర్ధకమైన టానిక్కూ, కాప్సూల్సూ వగైరా వ్రాయించుకుని యింటి ముఖం పట్టింది.

"అన్నట్టు ... ... వారానికోసారి వచ్చి 'చెక్' చేయించుకోనా?" అన్నది కారులో కూర్చోబోతూ మళ్లా వెనుదిరిగి.

శాంత నవ్వులో ఆమె అనుభవజ్ఞత కురిసింది

"ఏమైనా అవసరమన్పించితే ఫోనుచెయ్యి. ఆరోగ్యంగా వున్నవాళ్ళు నెలకోసారి డాక్టర్ని చూస్తే చాలు."

"ఎందుకైనా మంచిది. పదిహేను రోజుల కోసారి వస్తాను శాంతా."

"నీ యిష్టం. రోజూ వచ్చినా కాదనను." నవ్వింది. నవ్వుతూ సెలవు తీసుకున్నది విద్య.

కారు మెత్తగా సాగిపోతూన్నది.

కలలు అలలై కదలి పోతూన్నాయి.

చక్కటి బాబు, లేదా బేబీ, ఎవరో ఒకరు. పచ్చగా బొద్దుగా... ముద్దుగా అందంగా వుంటుంది తన బిడ్డ అందరినీ ఆకర్షించుతూ. అందుకు వలసిన జాగ్రత్తలన్నీ తాను తీసుకుంటుంది. తప్పక తీసుకోవాలి. తీసుకోగలదు.

ఎదురింటి కమలకు ఏకంగా నలుగురు పిల్లలు. ఎప్పుడూ ఈసురో మంటూనే వుంటారు, తల్లీ పిల్లలూ. ఎప్పుడూ ఏదో ఓ జబ్బే. పిల్లల్ని సాకే ఓపికే వుండదట.

సిగ్గులేకపోతే సరి! ఎందుకు ఈ రోజుల్లో కూడా అంతంతలేసి సంతానం!

చక్కగా యిద్దరంటే యిద్దరే వుంటారు నాకు పిల్లలు. నాకూ ఆరోగ్యం, వాళ్ళకూ ఆరోగ్యం.

శ్యామలకు అయిదుగురు ఆడపిల్లలు వరసాగ్గా. ఎమ్మెస్సీ పాసైంది. భర్త కూడా ఏదో ఆఫీసరే. ఎవరైనా ఇక చాలించమంటే 'మగపిల్లలు కావద్దా?' అంటూంటారు. ఈలోగా మరో నలుగురు కూడా ఆడవాళ్ళే అయితే?

ఛ, ఈ రోజుల్లో కూడా తెలివి తక్కువ కాదూ ఈ

ఛాందసాలన్నీ ? ఎప్పుడూ చాకిరీతో, రోగాలతో అసలు ఆఫీసరు భార్యా పిల్లలూ అన్నట్లే వుండరు.

నేను కలలోకూడా అటువంటి ఛాందస భావాలకు తావీయను; మగైనాసరే ఆడ అయినాసరే— ఇద్దరే బిడ్డలతో సరిపుచ్చి ఈ అందమూ, ఆరోగ్యమూ యిలాగే నిలుపుకొంటాను.

అంతెందుకూ ! శాంత — అవ్వటానికి డాక్టరే, చాలా పేరుంది. ఏం లాభం ? పిల్లలిద్దరూ వాన పాముల్లే వుంటారు. అసలు డాక్టరు పిల్లలంటే నమ్ముతారా ఎవరైనా ? ఎందుకుంటారు ? వాళ్ళ ఆలనా పాలనా ఆ డాక్టరమ్మగారు చూచుకుంటే కద ? ఆయాల దయా ధర్మాలపైననేగా వాళ్ళు బ్రతికేది !

ఛ. నేను ఎప్పటికీ అలా చెయ్యను. దర్జా నిలుపుకోటానికి ఆయాను నియమించుతాను; కానీ, పర్యవేక్షణ అంతా స్వయంగా చేస్తానుగా ?

బోనీబేబీ కంటెస్ట్‌లో ప్రథమ బహుమానం అందుకుంటుంది అందంగా ఆరోగ్యంగా వుండే నా బిడ్డ.

నా పెంపకం చూచి, డాక్టరైన శాంతకూడ సిగ్గుపడాలి !'

"అమ్మా ధర్మం. సంటి బిడ్డకు ఓ గుడ్డ ముక్క దానం సెయ్యి తల్లీ, నీ బిడ్డ పాపలు సల్లగుంటారు." పాయసం త్రాగుతూంటే పుల్ల ఏదో అడ్డుపడినట్లుగా చీకాకుతో చూచింది విద్య.

కలల ఊహాలోకంలో ఆమె కారు గమ్యం చేరడం గమనించనే లేదు. డ్రైవర్ తలుపుతీసి పట్టుకున్నాడు.

ఇంతలో ముష్టిది ఎక్కడినుంచి వచ్చి పడిందో? పరుగున వచ్చినట్టుగా వున్నది ఆయాసంతో రొప్పడం చూస్తే. ఒడిలో మురికి ఓడుతూన్న జీర్ణవస్త్రంలో పసిపిల్ల కేరు కేరు మంటూన్నది.

చూచీ చూడనట్లుగా అటు చూచింది విద్య, ఏవగించు కుంటూనే, మరొక ప్రక్క ఏదో కుతూహలంతో.

అసహ్యం ఉప్పెనగా వచ్చింది. వెంటనే ముఖం త్రిప్పుకుంది.

'ఛీ, కంపు. ఈ మనుషుల చుట్టూ ఆమడ దూరం వరకూ దుర్గంధమే. దాని ఒంటిమీాద పీలికలై పోయిన గుడ్డలు. జుట్టు అట్టకట్టింది. దీని బ్రతుక్కి పిల్ల ఒకటా సైదోడు!'

"దాని మొహాన తూపాయిపారేయి. లేకుంటే కదలదు

యిప్పుడు." అని దర్జాగా డ్రైవరుకు ఆజ్ఞాపించి తాను లోనికి వెళ్ళిపోయింది.

సంతోషంగా వున్నది గనుక ఆ మాత్రపు వితరణ కనపఱచింది.

అదే బిచ్చగత్తె పాలిట పెద్దవరం.

వేయి దీవనలు కురిపించింది.

శుభ విశేషం అత్తమామలను అలరించింది. భర్తను మురిపించింది.

జంటను ఆనందంలో ఓలలాడించింది.

"మెట్లు ఎక్కేటప్పుడూ దిగేటప్పుడూ జాగ్రత్తమ్మా, నెమ్మదిగా వెయ్యి అడుగులు."

ముఖాముఖి ఎదురైనపుడెల్లా మామగారి హెచ్చరిక విన్పించుతుంది.

"ఎక్కువగా తిరిగి అలసిపోకు. అన్నీ మేడమీదికే పంపిస్తాను. ఇందరు నౌఖర్లుండగా ఎందుకలా తిరుగుతావు? వేళకు వేడివేడిగా తిని పడుకో?"

గారంగా మందలించే అత్తగారు.

"విద్యా, అంతా బాగానే వుందా? ఏమైనా కావాలా? సిగ్గుపడకూడదు సుమా! ఏం కావాలన్నా అడిగేసేయి." రోజూ ఉదయం సాయంత్రం భర్త ప్రేమ మీరగా అనే మాటలవి.

"నన్ను రమ్మంటావా, నువ్వు వస్తున్నావా? శుభ్రంగా వున్నావ్ గా?" అంటూ రెండ్రోజులకోసారైనా డాక్టర్ శాంత ఫోన్ చేస్తుంటుంది.

ఆరోగ్యాది విషయాలు ఆరా తీస్తూ నాల్గురోజుల కొకసారి పుట్టింటినుండి ట్రంక్ కాల్స్ వస్తుంటాయి.

విద్య మనసు గర్వంగా నాట్యం చేస్తుంది.

'అబ్బ! నువ్వొచ్చాక యింకెంత గారామోరా బాబూ!' పుట్టబోయే వాడిని తలచుకొని నవ్వుకొంటుంది హాయిగా.

"ఇన్నిన్ని జాగ్రత్తలు తీసుకుంటామే మనం? అలా గాలికీ ధూళికీ బ్రతికేవాళ్ళు మరి ఎలా వుంటారో? ఆశ్చర్యం! ఏది దొరికితే దానితో పొట్ట నింపుకొని, ఒంటిని సరిగా కప్పే గుడ్డకూడా లేకుండా ఎండకూ ఎండుతూ, వానకు తడుస్తూ, గాలికి వణుకుతూ బ్రతికే బిచ్చగత్తెకు మరి అంత ఆరోగ్యంగా వున్న పిల్ల పుట్టడం ఆశ్చర్యం

కదూ? చెట్టు కొమ్మన గుడ్డ పేలికల ఉయ్యాలలో నిత్యం కేరుకేరుమని గోల పెడుతూనే వుండే ఆ పిల్ల మరి అంత గుండ్రంగా ఎలా వుంది?"

"వాళ్ళు ప్రకృతి బిడ్డలు. ఆ ప్రకృతే వాళ్ళ బలానికీ ఆరోగ్యానికీ గల రహస్యం. పెద్దపెద్ద భవనాలలో చుట్టూ తెఱలు వ్రేలాడదీసుకు కూర్చునే మన నాగరికతే మనకు అన్నింటికీ ప్రతిబంధకం." అన్నది శాంత నవ్వి.

ఈ సమాధానం తృప్తిగా లేదు విద్యకు.

మనస్సులో సందేహాలు సమసిపోలేదు.

మేడ వరండాలో తూగుటుయ్యాలపై కూర్చుంటే ఆ బిచ్చగాళ్ళుండే తావు స్పష్టంగా కన్పిస్తుంది.

తీరుబాటుగా కూర్చున్నప్పుడెల్లా వాళ్ళనూ, ఇంకా త్రోవనపోయే వాళ్ళ లాంటి వాళ్ళనూ పరిశీలనగా కుతూహలంగా చూడటం విద్యకు పరిపాటి అయిపోయింది.

4

రంగి గది చిమ్ముతూ ఆ కబురూ ఈ కబురూ చెప్తోంది. బాల్కనీలో కుర్చీలో కూర్చున్న విద్య పర ధ్యానంగా వింటోంది.

"ఏంటమ్మా? ఎక్కడుంది మీ ధ్యాస?" అన్నది జవాబు రాక. విద్య చూస్తూన్న దెసగా క్రిందికి తానూ దృష్టి సారించింది.

"అవిటి పిల్ల, బాబూ. సూపులేని కబోది. కాలు లేదు. దెరమ పెభువులు ఓ పైసా దానం సేయండి బాబూ."

దీనాతిదీనంగా, శోకాలు పెడుతూన్నట్లుగా అరుస్తూ యాచించుతూన్నది, ఆ చెట్టు క్రింది స్త్రీ, దారి ప్రక్కన కూర్చుని. ఒకగుడ్డ పఱచి పిల్లను అందు పరుండబెట్టింది. పిల్లకిపుడు ఆరునెలల వయసు వుండవచ్చు. కళ్ళపై ఈగలు ముసురుతున్నాయి. ఒకటే ఏడుస్తోంది. కాళ్ళు కదలడం లేదు.

"దాని పిల్లకన్నూ, చెయ్యీ — అంతా సవ్యంగా

చక్కగా వుండడం నేను చూచాను. చాలనాళ్లు దాన్ని నా దగ్గఱగా తెచ్చి అడుక్కునేది. ఇపుడు కన్నూ కాలూ లేకపోవట మేమిటి?" విస్మయంగా అడగడంలో కొంత ఖంగారు కూడా కన్పిస్తూన్నది, విద్యలో.

"ఛూ." అన్నది రంగి చీదరింపుగా. "పాడు మడుసులు! ఆల గురించా మీరు అడుగుతారు?"

"ఏం?"

"స్సీస్సీ" మఱలా ఛీత్కరించింది రంగి. "కన్నూ కాలూ వున్నోల్లకి ముట్టి ఎవరేత్తారు? అందుకని సుబ్బరంగా వున్న కన్ను పొడిసేత్తారు; కాలు యిరిసేత్తారు. అవిటోల్ల మని అడుక్కుంటే అందరికీ కనికరం పుట్టి అంతో యింతో బిచ్చం పెడతారు. మొన్న అది ఆ పొదల్లో జిల్లేడు సెట్ల కాడ ఆకులు కోత్తావుంటే నా కళ్ళతో నేను జూశా."

"ఎంత దారుణం!!" విద్య కంటి పాపలు భయంతో నిలిచిపోయాయి కొన్ని క్షణాలు.

"ఔనమ్మా. ఆ జిల్లేడుపాలు పిల్లదాని కంట్లో గుచ్చేసి వుంటాది."

"అబ్బబ్బ, చెప్పకు, వినలేక పోతున్నాను. ఇటువంటి

వాళ్ళను షూట్ చేసి పారేయాలి..." చెవులు చేతులతో మూసుకున్నది.

"చాల్లే. నిండు మనిషివి ఆట్టే హైరాన పడబోకు, అనవసర ఆలోచనలతో. దారిన పోయేవాళ్ళ గోలలన్నీ నీ కెందుకు?" అపుడే వచ్చిన అత్తగారు మందలించింది.

ఆమె వెనుకనే డాక్టరు శాంత ప్రవేశించింది.

"అదికాదు..."

"నాకు తెలుసు." ఏదో చెప్పబోతూన్న విద్యను శాంత వారించింది.

"ఆ అజ్ఞానులను మానసికంగా 'ఎడ్యుకేట్' చేయలేని వాళ్ళం, వాళ్ళకొక పని కల్పించి సవ్యమైన ఉపాధి చూపలేని వాళ్ళం- మనకి వాళ్ళని నిందించే అర్హతలేదు. పిల్లలను లంచగొండులుగా, స్మగ్లర్సుగా, నేరస్థులుగా తయారుచేసే వారికంటె పెద్ద నేరస్థులా వీరంతా?"

సమాధానం చెప్పలేని విద్య తల వాల్చుకున్నది.

5

"ఛీఛీ. ఆ దయ్యపు పిల్లను నేను చూడను. నా ఎదుటికి తేకండి, పీక పిసికి పారేయండి."

ఉన్మాదినిలా అరుస్తూన్న విద్యకు సముదాయింపు మాటలు చెప్పడానికే బెదరిపోతున్నారు ఎవరికి వారే.

డాక్టరు శాంత ధైర్యంగా, చనవుగా విద్య చెంత కూర్చుని, ఆమె ముఖంపై ఆచ్ఛాదించుకున్న చేతులను తొలగించింది.

"నీవంటి విద్యావతి, వివేకవతి యిలా ప్రవర్తించ గల దని నేనెన్నడూ అనుకోలేదు విద్యా. బిడ్డ ఈ లోకంలోని కొచ్చి ఒకరోజు పూర్తికావస్తున్నా నీకింకా మమకారం కలగలేదా ?"

"ఛీఛీ. ఎందుకు మమకారం ఆ శనిపై? ఆ అనాకారిపై?"

"మాతృత్వపు మమకారం పిల్ల ఆకారాదులపై

ఆధారపడి వుంటే ప్రపంచపు మనుగడ ఏనాడో నశించి వుండేది. అందాలూ, అవకరాలూ విధిలీలలు!"

"ఇంతటి డాక్టరువు— నువ్వూ విధీ దేవుడూ అంటు న్నావా?"

"మరి? అంతా నీ గొప్పే అయితే నీవు కోరుకున్న అందమైన బేబీని ఎందుకు సృష్టించలేక పోయావ్?"

ఈ తర్కవాదమూ, సవాలూ మరింత అసహనవతిని చేశాయి విద్యను.

"విధి! దైవం!" కసిగా పళ్ళు కొరికింది. పై పెదవి రెండుగా చీలి, వికృతంగా కన్పించుతూన్న పసి ప్రాణిని ఏహ్యంగా చూస్తూ. "ఏ దైవమైతే సృష్టించాడో అక్కడకే తిరిగి పంపించు!"

"విద్యా!"

"ఆఁ. అంతే. ఎలాంటి...ఎలాంటి కలలు కన్నాను నేను? ఏమిటీ శిక్ష? ఈ వికృతపు పిల్ల నా బిడ్డగా నా యింట పెరగటానికి వీల్లేదు. ఎంత సిగ్గు? ఎంతవమానం?"

"ఆలోచించి మాట్లాడు విద్యా. నీ బిడ్డ నీ యింట

పెరగటానికి వీల్లేదు; పరాయివాళ్ళు తమ యింట ఎందుకు పెట్టుకుంటారనుకున్నావ్ ?"

"అందుకే... ఏదో యింత యిచ్చి చంపిపారేయి!" పళ్ళ బిగువున అన్నది.

"విద్యా!" శాంత అదలింపు గదిలో మార్మోగింది.

"ఒకనాడు ఒక బీద స్త్రీ, మరే దారీ లేక ఉదర పోష ణార్థం పిల్లను అవిటిదానినీ గ్రుడ్డిదానినీ చేసిందని అస హ్యించుకున్నావ్. షూట్ చేసి పారేయాలన్నావ్. మరి... నీవు ఏకంగా ప్రాణమే తీయాలనుకుంటున్నావు కదూ? హాయిగా పెంచగల ధనరాసులుండీ, కన్నబిడ్డ ప్రాణం తీస్తావు కదూ?"

బయటనుండి బిచ్చగత్తె కంఠం మేడమీాదకి కూడా వినవస్తోంది.

"అమ్మా, కనికరించండి. అవిటి పిల్ల. దానం సెయ్యండి..."

"అదుగో విద్యా. నువ్వు ఏవగించుకొనే బీదరాలు. కన్నపిల్లను ఏదో విధంగా పోషించాలని తాపత్రయపడే నిస్సహాయురాలు..."

"అబ్బబ్బా! ఆపుజేయి ఇక శాంతా!" చెవులు మూసుకుంటూ దిక్కులు పిక్కటిల్లేలా ఆర్తనాదం చేసిన విద్య స్పృహ తప్పి పడిపోయింది.

—: అయిపోయింది :—